క్లుప్తంగా

విత్తన దుకాణాల తనిఖీ



తనిఖీ నిర్వహిస్తున్న ఏడీఏ ఎల్లయ్య

చండూరు : చండూరు మండల కేంద్రంలో మునుగోడు వ్యవసాయ సహాయ సంచాలకులు ఎల్లయ్య, మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌తో కలిసి మంగళవారం విత్తన దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ దుకాణదారులు రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని ఆదేశించారు. అన్ని అనుమతులు ఉంటేనే ఎరువులు, విత్తనాలు విక్రయించాలన్నారు.

ఫీడర్ చానల్‌లో చెట్ల తొలగింపు



ఫీడర్ చానల్‌లో కంపచెట్లను కాల్చివేస్తున్న కూలీలు

సాక్షి ఎఫెక్ట్..

మునుగోడు : మండలంలోని వివిధ గ్రామాలకు వరద నీరు మళ్లించే పలివెల ఫీడర్ చానల్‌లో చెట్లు, కంపను ఉపాధిహామీ కూలీలు పూర్తిగా తొలగించారు. గత సోమవారం సాక్షి దినపత్రికలో కంప చెట్లు కొట్టారు.. తొలగించడం మరిచారు అనే కథనం ప్రచురితమైంది. స్పందించిన ఉపాధిహామీ అధికారులు మంగళవారం కాల్వలోని కంపను కూలీలతో తగులబెట్టించారు. అంతే కాకుండా వరద నీటికి అడ్డుగా ఉన్న చెత్త, తాటి మొద్దులను తొలగించారు.

బాధ్యతల స్వీకరణ



ఆర్. భాస్కర్, ఎంపీడీఓ

మునుగోడు : మునుగోడు ఎంపీడీఓగా నియమితులైన ఆర్.భాస్కర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు మునుగోడు ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా విజయ్‌భాస్కర్ బాధ్యతలు నిర్వర్తించారు. నూతన ఎంపీడీఓ భాస్కర్‌కు ఎంపీపీ కర్నాటి స్వామి యాదవ్‌తోపాటు కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు.

తప్పిన ప్రమాదం

కేతేపల్లి : రోడ్డుపై వెళ్తున్న బైక్‌లో నుంచి మంటలు చెలరేగడంతో ప్రమాదం తప్పింది. ఈ సంఘటన మండలంలోని ఇనుపాముల శివారులో మంగళవారం చోటుచేసుకుంది. వివరాలు.. సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం శిల్పకుంట గ్రామానికి చెందిన నవీన్ కట్టంగూర్ మండల పామనగుండ్లలో ఓరైతు వద్ద పనిచేస్తూ కుటుంబంతో కలిసి అక్కడే నివాసం ఉంటున్నాడు. స్వగ్రామం శిల్పకుంట్లలో మంగళవారం శుభకార్యం ఉండడంతో పిండి వంటలు తయారు చేసుకుని భార్య, ముగ్గురు పిల్లలతో కలిసి బైక్‌పై బయలుదేరాడు. పిండి వంటల సంచిని బైక్‌కు కుడి వైపున ఉన్న సైలెన్సర్‌పై ఉంచి పడిపోకుండా ఉండేందుకు గోనె బస్తా కట్టాడు. ఇనుపాముల శివారులోని పల్లె రుచులు హోటల్ సమీపంలోకి చేరుకోగానే సైలెన్సర్ వేడికి గోనె బస్తా నుంచి ఒక్కసారిగా మంటలు వచ్చాయి. వెనక నుంచి వస్తున్న వాహనదారులు కేకలు వేయడంతో నవీన్ వెంటనే బైక్‌ను రోడ్డు పక్కన ఆపి మంటలను చల్లార్చడంతో ప్రమాదం తప్పింది.

నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా రామలింగయ్య



నియామక పత్రాన్ని అందిస్తున్న పవన్ కళ్యాణ్

నార్కట్‌పల్లి : నకిరేకల్ అసెంబ్లీ నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జ్‌గా నార్కట్‌పల్లి మండలం చౌడంపల్లి గ్రామానికి చెందిన చెరుకుపల్లి రామలింగయ్యను నియమిస్తూ జనసేన వ్యవస్థాపక అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా రామలింగయ్య మాట్లాడుతూ జనసేన పార్టీని బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని అన్నారు.

గ్రంథాలయ మహిళా సిబ్బందికి సన్మానం



సన్మానిస్తున్న రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి

రామగిరి(నల్లగొండ) : తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జిల్లాలోని గ్రంథాలయాల్లో విధులు నిర్వర్తించే మహిళా ఉద్యోగులను సంస్థ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి బి.బాలమ్మ, సిబ్బంది నిర్మలాదేవి, వి.తారకేశ్వరీ, ఆర్.కుసుమశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కంటి వెలుగు

- చిట్యాల మండలంలో 25,355 మందికి కంటి పరీక్షలు
- రీడింగ్ అద్దాలను వెంటనే అందించిన వైద్యులు
- విడతల వారీగా ప్రత్యేక అద్దాలు అందజేత



ఉరుమడ్లలో కంటి వెలుగు శిబిరంలో అద్దాలు అందజేస్తున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి(ఫైల్)

చిట్యాల : సంపూర్ణ అంధత్వ నివారణకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం చిట్యాల మండలంలో పూర్తయ్యింది. కంటికి సంబంధించిన సమస్యలతో బాధపడుతున్న వారికి ఆయా గ్రామాల్లోని కంటి వైద్య బృందం అధునాతన మిషన్‌లతో కంటి పరీక్షలు చేసి ఉచితంగా అద్దాలను అందజేశారు.

రెండు పీహెచ్‌సీల ఆధ్వర్యంలో..

చిట్యాల మండలంలోని చిట్యాల ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, వెలిమినేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో రెండు బృందాలుగా కంటి వెలుగు కార్యక్రమాన్ని జనవరి 18వ తేదీన ప్రారంభించారు. జూన్ 12 వ తేదీన మండలంలో కంటి వెలుగు శిబిరాలు ముగిశాయి. చిట్యాల మున్సిపాలిటీతోపాటు 18 గ్రామ పంచాయతీల్లో ఈ కంటి వెలుగు వైద్య శిబిరాలను వైద్యాధికారులు విజయవంతంగా పూర్తి చేశారు. కంటి వెలుగు కార్యక్రమంలో మొత్తం 25,355 మందికి కంటి వైద్య పరీక్షలను చేశారు. చిట్యాల పీహెచ్‌సీ పరిధిలోని చిట్యాల మున్సిపాలిటీతోపాటు మరో ఏడు గ్రామ పంచాయతీల్లో కంటి వెలుగు వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ గ్రామాల్లో 14,064 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 2003 మందికి వెంటనే రీడింగ్ అద్దాలను అందజేశారు. మరో 1648 మందికి ప్రత్యేక అద్దాలను విడతల వారీగా అందజేశారు. కాగా 303 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని జిల్లా కేంద్ర ఆస్పత్రికి కంటి వైద్యులు రెఫర్ చేశారు. వెలిమినేడు పీహెచ్‌సీ పరిధిలో 11 గ్రామ పంచాయతీల్లో కంటి వెలుగు కార్యక్రమాన్ని వైద్య బృందం నిర్వహించింది. ఈ పీహెచ్‌సీ పరిధిలో మొత్తంగా 11,291 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 1469 మంది రీడింగ్ అద్దాలను వెంటనే అందజేశారు. మరో 1080 మందికి ప్రత్యేక అద్దాలను విడతల వారీగా అందజేశారు. 1358 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని జిల్లా కేంద్ర ఆస్పత్రికి రెఫర్ చేశారు. అంతేకాకుండా కంటి పరీక్షలు చేయించుకున్న వారికి అసరమైన మందులను సైతం వైద్య సిబ్బంది అందజేశారు.

ఎలాంటి లోటుపాట్లు లేకుండా..

మొదటి విడత కంటి వెలుగు వైద్య పరీక్షల్లో జరిగిన లోపాలను సరిచేసుకుంటూ రెండో విడతను ప్రత్యేక శ్రద్ధతో నిర్వహించారు. వైద్య పరీక్షలకు వచ్చిన వారి పూర్తి వివరాలు తెలుసుకుని నమోదు చేసుకున్న అనంతరం కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. రీడింగ్ అద్దాలు అవసరమైన వారికి వెంటనే అద్దాలు అందజేశారు. ప్రత్యేక అద్దాలు అవసరమైన వారికి విడతల వారీగా అందజేశారు. ఈ ప్రత్యేక అద్దాలు ఒకరివి మరొకరికి మారకుండా అద్దాల బాక్స్‌పై కంటి పరీక్షలు చేసుకున్న వారి పూర్తి సమాచారం ముద్రించారు.

రెండు బృందాలతో కంటి పరీక్షలు



చిట్యాల మండలంలో జనవరి 18వ తేదీన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించాం. మండల వ్యాప్తంగా రెండు పీహెచ్‌సీల పరిధిలోని గ్రామాల్లో రెండు వైద్య బృందాలతో కంటి వైద్య పరీక్షలు నిర్వహించాం. కంటి సమస్యలు ఉన్న వారిని గుర్తించి అవసరమైన వారికి వెంటనే కంటి అద్దాలను అందజేశాం. కంటి ఆపరేషన్లు అవసరమైన వారికి జిల్లా కేంద్ర ఆస్పత్రికి రెఫర్ చేశాం.

–డాక్టర్ గట్టు కిరణ్‌కుమార్, చిట్యాల పీహెచ్‌సీ

ఉపయోగకరంగా ఉంది



రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లోనే కంటి వైద్య పరీక్షలు నిర్వహించడం, అవసరమైన వారికి ఉచితంగా వెంటనే కంటి అద్దాలు అందించడం బాగుంది. ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి చూపించుకోలేని వారికి వృద్ధులకు ఈ కంటి వెలుగు కార్యక్రమం ఎంతో ఉపయోగకరంగా ఉంది. నేను కూడా మా గ్రామంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరంలో పరీక్షలు చేయించుకుని కంటి అద్దాలు పొందాను.

–బందారి సునిత, పిట్టంపల్లి, చిట్యాల మండలం

మహిళలు గౌరవించబడేలా సంక్షేమ పథకాలు



సమావేశంలో మాట్లాడుతున్న నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల, చిత్రంలో ప్రజాప్రతినిధులు, అధికారులు

- ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి



వేదికపై నృత్యం చేస్తున్న చిన్నారులు

నల్లగొండ : బీఆర్ఎస్ ప్రభుత్వం మహిళలు గౌరవించబడేలా సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తోందని నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి అన్నారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలో మహిళా, శిశు, వయో వృద్ధుల, దివ్యాంగుల శాఖ ఆధ్వర్యంలో నల్లగొండ నియోజకవర్గ ×మహిళా సంక్షేమ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన మహిళలు సంతోషంగా జీవిస్తున్నారని అన్నారు. గతంలో ఆడపిల్లలు పుడితే పురిట్లోనే చంపేవారని, ఆడపిల్ల మహాలక్ష్మి అని భావించి పెళ్లికి భారం కాకుండా పేద కుటుంబాలకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ ద్వారా ఆర్థిక సహాయం అందజేస్తున్నామని తెలిపారు. గర్భిణులకు మూడు నెలలు నుంచి పౌష్టికాహారం అందజేస్తున్నామన్నారు. కేసీఆర్ కిట్టు అందజేసి ఆడపిల్ల పుడితే రూ.13,000, మగ బిడ్డ పుడితే రూ.12,000 అందజేస్తున్నామన్నారు. ఐకేపీ సెంటర్ల ద్వారా మహిళలకు సరైన గుర్తింపు ఇచ్చామన్నారు. అర్హులైన వారికి డబుల్ బెడ్ రూం ఇళ్లు, స్థలం ఉంటే ఇల్లు కట్టుకోవడానికి మూడు లక్షల రూపాయల ఆర్థిక సాయం అందజేస్తామని తెలిపారు. బీసీ రుణాల కింద ఒక లక్ష రూపాయలు కూడా మహిళల పేరు మీదనే ఇవ్వనున్నట్లు తెలిపారు. గతంలో పెన్షన్ రూ.200 ఉంటే బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, గీత కార్మికులు, చేనేత కార్మికులకు రూ.2016 ఇస్తున్నామని, అదేవిధంగా దివ్యాంగులకు రూ.3016 నుంచి రూ.4016 పెంచుతున్నట్లు ప్రభుత్వం ప్రకటించిందని అన్నారు. సీఎం కేసీఆర్ రైతులకు ఉచిత విద్యుత్ అందించి ఆదుకున్నారన్నారు. అదేవిధంగా పంట పెట్టుబడి సాయం అందజేస్తున్నారని తెలిపారు. అనంతరం మహిళా సంఘాలకు రుణాల చెక్కులను పంపిణీ చేశారు. వివిధ రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మహిళలను ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన స్టాళ్లను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మహిళా, శిశు, వయోవృద్ధుల, దివ్యాంగుల శాఖ అధికారి కృష్ణవేణి, ఉద్యాన శాఖ అధికారి సంగీత లక్ష్మి, జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, ఎంపీపీలు విజయలక్ష్మి, సుమన్, కరీం పాషా, కౌన్సిలర్లు యామ కవిత, ఎడ్ల శ్రీను, పూజిత, సర్పంచులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి, కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, ఎంపీ బడుగుల, జెడ్పీ చైర్మన్ బండా



సమావేశానికి హాజరైన మహిళలు

కట్టంగూర్ : మహిళల సంక్షేమమే ధ్యేయంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేస్తోందని రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి తెలంగాణ మహిళా సంక్షేమ దినోత్సవంలో వారు పాల్గొని మాట్లాడారు. కేసీఆర్ కిట్ ద్వారా ఇమ్యూనైజేషన్, పౌష్టికాహారం, శిశువుల ఆరోగ్య సంరక్షణకు అవసరమైన 15 రకాల వస్తువులను ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. నియోజకవర్గంలో 42,872 మందికి రూ.604 కోట్ల పింఛన్లు, 10217 మందికి కల్యాణలక్ష్మి పథకం ద్వారా రూ.104 కోట్లు అందజేశారని పేర్కొన్నారు. బ్రహ్మణవెల్లెంల ప్రాజెక్ట్ ద్వారా మరో రెండు నెలల్లో 60వేల ఎకరాలకు నీరు అందించనున్నట్లు తెలిపారు. ముచ్చటగా మూడోసారి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గెలిపించాలన్నారు. అనంతరం స్త్రీనిధి రుణాలు, కళ్యాణలక్ష్మి చెక్కులను మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా మహిళలు కోలాటాలతో డప్పు చప్పుళ్లతో బతుకమ్మలను ఎత్తుకుని ర్యాలీ నిర్వహించారు. కళాకారులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, నకిరేకల్, చిట్యాల మున్సిపల్ చైర్మన్లు రాచకొండ శ్రీనివాస్, కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, ఎంపీపీలు జెల్లా ముత్తిలింగయ్య, కన్నెబోయిన జ్యోతి, సూదిరెడ్డి నరేందర్ రెడ్డి, కొలను సునిత, జెడ్పీటీసీలు తరాల బలరాములు, మాద ధనలక్ష్మి, సుంకరి ధనమ్మ, బొప్పని స్వర్ణలత, మార్కెట్ కమిటీ చైర్మన్ జడల ఆదిమల్లయ్య, ఐసీడీఎస్ సీడీపీఓ అస్రా, పీఏసీఎస్ చైర్మన్ నూక సైదులు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఏడుకొండలు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పోగుల నర్సింహ, తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి, ఎంపీడీఓ పొరెళ్ల సునిత, ఏపీఎం వినోద, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సువర్ణ, ప్రజా ప్రతినిధులు, పలుశాఖల అధికారులు ఉన్నారు.

అన్నివర్గాల సంక్షేమమే కేసీఆర్ ధ్యేయం



కేతేపల్లిలో యాదవులకు గొర్రెలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

కేతేపల్లి : అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. తెలంగాణలో అమలవుతున్న దళితబంధు, కుల వృత్తులు చేసుకునే బీసీలకు లక్ష రూపాయలు, గొర్రెల పంపిణీ వంటి కార్యక్రమాలు దేశంలో మరెక్కడా లేవన్నారు. కార్యక్రమంలో నకిరేకల్ ఏఎంసీ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, కేతేపల్లి జెడ్పీటీసీ బొప్పని స్వర్ణలతసురేష్, కేతేపల్లి ఎంపీటీసీ ఎర్రబోయిన వెంకన్నయాదవ్, సర్పంచులు కోట వెంకటేశ్వరావు, కట్ట శ్రవణ్, బీఆర్ఎస్ మండల అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు మారం వెంకట్‌రెడ్డి, చిమట వెంకన్న, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

యూజీడీ పనులకు శంకుస్థాపన

చండూరు : చండూరు మండల పరిధిలోని బోడంగిపర్తి గ్రామంలో ఎంపీటీసీ నిధుల నుంచి మంజూరైన రూ.8 లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ (యూజీడీ) పనులకు ఎంపీపీ పల్లె కళ్యాణిరవికుమార్ మంగళవారం శంకుస్థాపన చేశారు. ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విరాళం అందజేత

నల్లగొండ : జిల్లా కేంద్రంలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేయనున్న సావిత్రీబాయి పూలే, జ్యోతి రావు పూలేల విగ్రహాల ప్రతిష్ఠాపనకు రూ.25,000 విరాళాన్ని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నారబోయిన రవి ముదిరాజ్ మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంఘం అధ్యక్షుడు చక్రహరి రామరాజు, గౌరవ అధ్యక్షుడు కంది సూర్యనారాయణ, ఉపాధ్యక్షుడు కేశబోయిన శంకర్‌ముదిరాజ్, సలహాదారులు నేలపట్ల సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు నకిరేకంటి కాషయ్య గౌడ్, యువజన సంఘం అధ్యక్షుడు చొల్లేటి రమేష్, రేగులగడ్డ సత్యనారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న నారబోయిన రవి

క్విజ్ పోటీల్లో పాల్గొనాలి

నకిరేకల్ : రాజీవ్ గాంధీ క్విజ్ పోటీలో పాల్గొని బహుమతులు గెలుచుకోవాలని టీ పీసీసీ ప్రధాన కార్యదర్శి కొండేటి మల్లయ్య కోరారు. నకిరేకల్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. క్విజ్ పోటీల్లో పాల్గొనాలనుకునే వారు రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి జూలై 1 వరకు అవకాశం ఉందన్నారు. 60 నిమిషాల్లో 60 ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలన్నారు. విజేతలకు ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్‌లు, మహిళలకు ఎలక్ట్రిక్ స్కూటీలు బహుమతులుగా అందజేయనున్నట్లు తెలిపారు. రిజిస్ట్రేషన్‌తో కూడిన లింక్‌ను పొందడానికి 7661899899 నంబర్‌కు మిస్ కాల్ ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు లింగాల వెంకన్న, యాస కర్ణాకర్‌రెడ్డి, పల్‌రెడ్డి ఉపేందర్‌రెడ్డి, ముక్కాముల శేఖర్, గన్నపురెడ్డి భిక్షంరెడ్డి, యానాల శ్రీనివాస్‌రెడ్డి, ఎలిజాల నాగరాజు, ఆవుల వేణు ఉన్నారు.

పల్లె రవికుమార్‌కు వినతి

మర్రిగూడ : తెలంగాణ గీత పారిశ్రామిక సంఘం చైర్మన్ పల్లె రవికుమార్‌ను మంగళవారం మండలంలోని గౌడ సంఘం నాయకులు హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. బీసీ కులాలకు చెందిన చేతివృత్తిదారులకు ప్రభుత్వం అందించే రూ.లక్ష ఆర్థికసాయాన్ని గౌడ కులస్తులకు కూడా అందించే విధంగా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని వారు కోరారు. కార్యక్రమంలో చెరుకు లింగంగౌడ్, పందుల రాములుగౌడ్, శ్రీరాములుగౌడ్, ముత్యాలు గౌడ్, గునగంటి యాదగిరి, ఐతగోని యాదగిరిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వడ్డెర సొసైటీలకు కాంట్రాక్టులు కేటాయించాలి

చిట్యాల : ప్రభుత్వ కాంట్రాక్ట్ పనుల్లో వడ్డెర సొసైటీలకు యాభై శాతం పనులు కేటాయించాలని పీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నూనె వెంకటస్వామి డిమాండ్ చేశారు. చిట్యాలలో మంగళవారం జరిగిన వడ్డెర కులస్తుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వడ్డెర కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చాలన్నారు. వడ్డెర కులస్తులకు కుల వృత్తి నిర్వహణకు ఐదు లక్షల రూపాయల వరకు వందశాతం సబ్సిడీతో రుణాలు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఓర్సు శ్రీరాములు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఉయ్యాల లింగస్వామి, కోనేటి యాదయ్య, పాలడుగు సందీప్, వరికుప్పల భిక్షపతి, రూపని ఇద్దయ్య పాల్గొన్నారు.

నిరంకుశ పాలనకు నిదర్శనం

కేతేపల్లి : ట్రిబుల్‌ఆర్ నిర్మాణంలో భూములు కోల్పోతున్న యాదాద్రిభువనగిరి జిల్లా రాయగిరి రైతులకు పోలీసులు సంకెళ్లు వేసి కోర్టుకు తీసుకెళ్లడం కేసీఆర్ నిరంకుశ పాలనకు నిదర్శనమని టీపీసీసీ మైనార్టీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎండీ.యూసుఫ్‌జానీ అన్నారు. మంగళవారం ఆయన కేతేపల్లిలో విలేకరులతో మాట్లాడారు. అన్నం పెట్టే రైతులకు సంకెళ్లు వేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు.

డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా



ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకులు

నల్లగొండ టూటౌన్ : జిల్లాలో గుర్తింపు లేకుండా పాఠశాలలు నడుపుతున్న యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు పెట్టాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ ఆవుల సంపత్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ప్రైవేట్ పాఠశాలలు అధిక ఫీజులు వసూలు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదన్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా నడిపిస్తున్న పాఠశాలలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. అధికారులు అందుబాటులో లేకపోవడంతో కార్యాలయం డోర్‌కు వినతి పత్రం అంటించారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న న్యాయవాదులు

రామగిరి(నల్లగొండ) : యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రంలో ఈ నెల 17, 18 తేదీల్లో జరిగే ఆలిండియా లాయర్స్ యూనియన్(ఐలు) రాష్ట్ర మూడో మహాసభలను జయప్రదం చేయాలని ఐలు రాష్ట్ర కార్యదర్శి అనంతుల శంకరయ్య పిలుపునిచ్చారు. మంగళవారం నల్లగొండ జిల్లా కోర్టులో మహాసభల వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాసభలకు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి బి.సుదర్శన్‌రెడ్డి, రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఉజ్వల భూయాన్, న్యాయమూర్తి కె.లక్ష్మణ్ ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేతి రఘుపతి, మాజీ అధ్యక్షుడు జి.వెంకటేశ్వర్లు, కె.జవహర్‌లాల్, ఏ.సతీష్‌కుమార్, బ్రహ్మచారి, శ్రీనివాస్‌రెడ్డి, తండు వెంకటేశ్వర్లు, రాములు, భానుప్రకాష్, శేఖర్, రహీమొద్దీన్, నగేష్, యాదయ్య, రమేష్ పాల్గొన్నారు.

చదువుతోనే చక్కని భవిష్యత్

నకిరేకల్ : బాలలకు చదువును అందించడంతోనే చక్కటి భవిష్యత్ ఇవ్వగలమని నకిరేకల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్‌కే ఆరిఫ్ అన్నారు. ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మండల న్యాయ సేవ కమిటీ, పోలీస్ శాఖ, జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నకిరేకల్‌లో నిర్వహించిన చట్టాలపై అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పిల్లలను మానసికంగా, శారీరకంగా అభివృద్ధికి ఆటంకం కలిగే ఏ పనిలో వినియోగించకూడదని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ రాఘవరావు, సీనియర్ న్యాయవాదులు బి.ప్రకాశ్‌రావు, పి. మల్లయ్య, వెంకన్న, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సభ్యుడు కనుకుంట్ల విద్యాసాగర్‌రెడ్డి, ఎస్ఐ గోపికృష్ణ, నగేష్, సుధాకర్, ఎస్.వెంకటేశ్వరరావు, రాంరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్జి ఎస్‌కే ఆరిఫ్

రైతులకు అవగాహన

మునుగోడు : వానాకాలం పంట సాగుకు విత్తనాలు కొనుగోలు చేసే రైతులు ఎమ్మార్పీ ధరలు చెల్లించి విత్తనాలు కొనుగోలు చేయాలని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ గౌడ్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాల్లో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొందరు వ్యాపారులు అధిక డిమాండ్ కలిగిన పత్తి విత్తనాలను ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అధిక ధరలకు విక్రయించినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు పీహెచ్‌సీ భవనానికి భూమిపూజ

కనగల్ : మండల కేంద్రంలో పీహెచ్‌సీ భవనానికి బుధవారం ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి భూమిపూజ చేయనున్నట్లు బీఆర్ఎస్ కనగల్ మండల అధ్యక్షుడు అయితగోని యాదయ్యగౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్

నల్లగొండ టూటౌన్ : గత ఎన్నికల ముందు చేసిన వాగ్దానాలను అమలు చేయడంలో కేసీఆర్ ప్రభుత్వం విఫలమైందని, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి బీజేపీని బలోపేతం చేయాలని మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ అన్నారు. మంగళవారం నల్లగొండలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన బీజేపీ మోర్చాల సంయుక్త సమ్మేళన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం బడుగు, బలహీనవర్గాల జీవన ప్రమాణాలను దెబ్బతీస్తోందని, ప్రజలకు కావాల్సిన విద్య, వైద్యంపై దృష్టి పెట్టకుండా ప్రజలను మోసం చేస్తోందన్నారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం ప్రజారంజక పాలన అందిస్తోందని, జాతీయ రహదారులు, మున్సిపాలిటీలకు నిధులు కేటాయిస్తున్నా.. బీఆర్ఎస్ ప్రభుత్వం కమీషన్లకు కక్కుర్తి పడుతూ తూతూమంత్రంగా పనులు చేయిస్తోందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీని గెలిపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని, మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకుపోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేతి వృత్తిదారులను, బీసీలను ప్రలోభాలకు గురి చేస్తోందని ఆరోపించారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి మాదగాని శ్రీనివాస్ గౌడ్, సీనియర్ నాయకులు గోలి మధుసూదన్‌రెడ్డి, వీరెల్లి చంద్రశేఖర్, ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి పోతెపాక సాంబయ్య, బండారు ప్రసాద్, నిమ్మల రాజశేఖర్‌రెడ్డి, దాయం భూపాల్‌రెడ్డి, నాగం వర్షిత్‌రెడ్డి, కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి, ఐతరాజు సిద్ధు, దుబ్బాక మల్లేష్, అబ్రహం, నరసింహ పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రం పరిశీలన

చిట్యాల : పట్టణంలోని జెడ్పీహెచ్ఎస్‌లో ఏర్పాటు చేయనున్న గ్రూప్–4 పరీక్ష కేంద్రాన్ని చిట్యాల తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు మంగళవారం పరిశీలించారు. పాఠశాలలోని గదులు, మౌలిక వసతులు, భద్రతా ఏర్పాట్లను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం గోగికార్ మాధవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

మునుగోడు : అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందడానికి స్థోమత లేని ఓ నిరుపేద ముస్లిం మహిళకు రూ.50వేల ఆర్థిక సహాయం పంపి మానవత్వం చాటుకున్నారు మునుగోడు మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి. నల్లగొండ బీటీఎస్‌కు చెందిన షహీనా అనే మహిళకు గర్భాశయంలో సమస్య రావడంతో వైద్యులు శస్త్ర చికిత్స చేయించుకోవాలని సూచించారు. నిరుపేద కుటుంబ కావడంతో చికిత్స చేయించుకునేందుకు ఇబ్బంది పడుతున్న విషయం ఆమె బంధువుల ద్వారా తెలుసుకున్న రాజగోపాల్ రెడ్డి రూ. 50వేల నగదును మునుగోడు మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ అన్వర్ ద్వారా మహిళకు అందజేశారు.

చలమల్ల కృష్ణారెడ్డి ఆర్థికసాయం

మునుగోడు మండలంలోని కిష్టాపురం గ్రామానికి చెందిన సురిగ వెంకటరమణ–అనూష దంపతుల నాలుగేళ్ల కూతురు అనారోగ్యం ఇటీవల మృతి చెందింది. ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చలమల్ల కృష్ణారెడ్డి రూ. 10వేలు పంపగా ఆ నగదును మంగళవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సురిగి నర్సింహగౌడ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మునుకుంట్ల భూపాల్, కందుల సూర్యప్రకాష్, నీరుడు శేఖర్, జాల నర్సింహ, బాలగోని వేణు, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఉత్సవాలు

కనగల్ : మండల పరిధిలోని పర్వతగిరి గ్రామంలో నూతనంగా నిర్మించిన కంఠమహేశ్వర–సురమాంభదేవి ఆలయ ఉత్సవాలు కొనసాగుతున్నాయి. మంగళవారం మహిళా భక్తులు నీళ్లబిందెలతో వచ్చి నీళ్లను పోసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించారు. నేడు వడిబియ్యం, బోనాల ఊరేగింపు, రాత్రి 1:30గంటల కల్యాణ మహోత్సవం ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



నీటి బిందెలతో వస్తున్న మహిళలు